# మారేకాలంలో మారని ఓ కథ

**- తమిరిశ జానకి**

"ఇంక నిద్రపో బాబూ పొద్దుపోయింది..."

"ఉహూ. కథ చెప్తేగానీ నిద్రపోను..." ముద్దు ముద్దుగా గారాలు పోయాడు రవిబాబు.

"బుజ్జిబాబుగారికీరోజేం కథ కావాలి?" నవ్వింది నిర్మల.

"ఆ..మరి...మరేమో...నాకు...నాగమల్లి పువ్వు కథ కావాలి"

"అస్తమానం ఆ కథే అడుగుతుంటావు. నీకంత ఇష్టమా ఆ కథంటే?"

"ఊ... బోల్డంత ఇష్టం..."

నిర్మల చూపులు రవిబాబు ముఖం మీదే వున్నాయి మన సెక్కడో!

!+!+!+!

"ఇంకనేవెళ్తాను హరీ... పొద్దుపోయింది..." హరి చేతుల్లో వున్న తన చేతిని వెనక్కి తీసుకుంటూ అంది గిరిజ.

"ఉహూ! పాట పాడితేగానీ వెళ్ళనివ్వను."

"అబ్బాయిగారికీ రోజేం పాట కావాలి?"

"ఆ.. మరి... మరేమో... మల్లెమొగ్గ పాట కావాలి."

"మల్లెమొగ్గ పాటా?"

"ఊ మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడచిరా... ఆ పాట కావాలి."

"ఓ.... ఎక్కువగా ఆ పాటే పాడమని అడుగుతుంటారు మీరు... అంత ఇష్టమా ఆ పాటంటే మీకు?"

"ఊ... చాలా చాలా ఇష్టం"

!+!+!+!

"నిర్మలా!...."

"ఏం కావాలి అక్కయ్యగారూ?"

"తల నొప్పిగా వుంది. కాస్త అమృతాంజనం రాస్తావా?" తరచుగా అనారోగ్యంతో మంచంపడుతూనే వుంది సులోచన. మనోవ్యాధికి మందెక్కడుంది?

"ఆలోచనలతో ఆరోగ్యం బాగా పాడుచేసుకుంటున్నారు మీరు... రవిబాబు కోసమైనా

ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి అక్కయ్యగారూ...” మందు రాస్తూ, మనస్ఫూర్తిగా వున్నమాట చెప్పింది నిర్మల.

“ఏం చెయ్యమంటావు నిర్మలా! మనశ్శాంతిలేని బతుకైపోయింది. ఆ రాక్షసి కళ్ళు మా వారిమీదే పడాలా? ఇంకెవరూ దొరకనట్టు, పెళ్ళయి, భార్య బతికున్నవారినే వల్లోవేసుకోవాలా! ఇంకో ఆడదాని ఉసురు తగుల్తుందన్న భయమే లేకపోయింది...” ఎప్పుడూ నిర్మల దగ్గిర చదివే దండకమే చదవడం మొదలు పెట్టింది సులోచన.

“నేనంటే ఎంత ప్రాణంగా వుండేవారో... అటువంటి మనిషిని వల్లో వేసుకుందంటే అదెంత టక్కులాడో! మాయలమారో! అసలు నేను కూడా ఆయనతో వెళ్ళిపోయి, ఆ ఊళ్ళో కాపురం పెట్టివుంటే ఇంత ఘోరం జరిగివుండకపోను. “ఆ ఊళ్ళో వుండబోయేది ఒక్క ఆర్నెల్లేగా... ఆర్నెల్లకోసమేగా ఆ వూరు బదిలీ చేశారు. తర్వాత మళ్ళీ ఈ ఊరే వేస్తామని చెప్పారు. అటువంటప్పుడు సంసారం ఇక్కడ ఎత్తిపెట్టి, అందరం పొలో మంటూ అంత దూరపు ఊరు పోవడం ఎందుకు? అక్కడ ఇళ్ళ అద్దెలు కూడా చాలా ఎక్కువ. నువ్వూ, పిల్లాడు. మీ నాన్నతో ఇక్కడే వుండిపోండి. నేనొక్కడినే వెళ్తానా ఊరు. ఆర్నెల్లు ఎంతలో గడుస్తాయి?” అన్నారాయన. నాకూ ఆయన చెప్పింది సబబే అనిపించింది. అసలే నాన్న ఆరోగ్యం ఏమంత బాగాలేదు. పెద్ద వయసు. అంత దూరపు ఊరు పడిపోయామంటే ఆ గాలి మార్పు, నీటి మార్పుకి ఏం ముంచుకొస్తుందో ఏమో! ఆర్నెల్లు ఇట్టే గడిచిపోతాయి. ఆ మాత్రం దానికి మకాం మార్చడమెందుకు అనుకున్నాను. అసలే అక్కడ ఇళ్ళఅద్దెలు ఎక్కువంటున్నారు. ఆయనొక్కరూ వెళితే ఒక్క గది తీసుకుంటే సరిపోతుంది. ఇక్కడ సొంత ఇల్లుంది నాన్నకి. కొడుకైనా, కూతురైనా నాన్నకి నేనే కాబట్టి ఇల్లు మాదే అయింది. వున్న ఊళ్ళో పడివుండక, అంతదూరం ఆర్నెల్లకోసమని మకాం మార్చడమెందుకులే అని, ఆయన చెప్పినట్టే ఇక్కడే వుండిపోయాం. ఇలా అవుతుందని కల్లో కూడా అనుకోలేదు. ఆ పిశాచం ఆయన్ని పట్టుకుంది. నా ఉసురు తగలకపోతుందా దానికి?....”

!+!+!+!

“గిరిజా!” పిల్చాడు హరి.

“ఏం కావాలండీ?”

“తల నొప్పిగా వుంది. కాస్త అమృతాంజనం రాస్తావా?”

“ఈ మధ్య ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు కనపడుతున్నారు మీరు.” మందురాస్తూ మనసులో మాటపైకి అంది.

“అబ్బే!... నాకేం ఆలోచనలున్నాయి?”

“మరి... మరి... నేనొకటి అడుగుతాను. ఏమీ అనుకోరుకదా.”

“అడుగు....”

“ఇన్నాళ్ళకి... ఇప్పటికైనా.... కనీసం గుళ్ళో పెళ్ళికైనా ఒప్పుకున్నారు మీరు. బానే వుంది. దానికైనా పెద్దల ఆశీర్వాదం వుండాలిగా?”

మీ బామ్మ వుందిగా?”

“నావైపు నా అన్నవాళ్ళు వున్నది మా బామ్మ ఒక్కత్తే.

ఆవిడ ఆశీర్వాదం తప్పక ఉంటుంది మనకి. కానీ, మీ తరపున...”

“చెప్పానుగా గిరిజా! నాకెవ్వరూ లేరు. ఒంటరిగాడిని, నిన్ను పెళ్ళి చేసుకోవాలంటే నేనెవ్వరి అనుమతీ తీసుకోనవసరం లేదు కూడా. నిన్ను చూసిన మొదటి రోజునే, నువ్వు కావాలనిపించింది నాకు. నీ కళ్ళల్లో ఏదో ఆకర్షణ... నన్ను నీ వాడిని కమ్మంది అంతే... ఆ రోజునించీ ఎంత పిచ్చివాడిలా నీ చుట్టూ తిరుగుతున్నానో నీకు తెలియనిదా? అసలు... పెళ్ళి చేసుకోకుండా మనిద్దరం కలిసి ఒకచోట వుండకూడదా? నువ్వు నాకు నచ్చావు నేను నీకు నచ్చాను అది చాలదూ!”

“ఏమో! ఈ సంఘం ఒప్పుకోదు”

“సరే. అందుకే నీ తృప్తికోసం గుళ్ళో పెళ్ళి చేసుకుందామంటున్నాను ఆడంబరం నాకు గిట్టదు.”

“ఎంత విచిత్రంగా అయింది మన పరిచయం. జీవితాంతం నన్ను మీ నీడన వుండనిస్తారుగా?” గిరిజ కళ్ళల్లో బెదురు.

“పిచ్చిదానా? ఏనాడో మనిద్దరం ఒకటి అయ్యాం. నువ్వు కావాలంటూ నేనే కదా నీ వెంటబడి నీ మనసు గెల్చుకున్నాను. అటువంటప్పుడు నువ్వు లేకుండా నేనుండగలనా?” అందంగా నవ్వాడు హరి.

!+!+!+!

“ఆ రోజు... “మీ ఇంట్లో ఒక గది అద్దెకిస్తారని తెల్సింది అంటూ నువ్వొచ్చిన రోజు నాకు బాగా గుర్తుంది నిర్మలా. అదే మొట్టమొదటిసారి నిన్ను చూడటమైనా, నీ మీద నాకు ఆ క్షణంలోనే మంచి అభిప్రాయం ఏర్పడిపోయింది. నీ మొహంలో అమాయకత్వం చూశాన్నేను. నీ మాట తీరులో వినయం కనపడింది నాకు. ‘నా’ అని చెప్పుకోడానికి వున్న ఒకే ఒక మనిషి ఈ మధ్యనే దూరమైంది. ఒంటరిదాన్ని. ఈ ఊళ్ళో వున్న ఒకే ఒక స్నేహితురాలి ద్వారా ఇక్కడ కొత్తగా పెట్టిన ప్రైవేట్ నర్సరీ స్కూల్లో టీచర్ ఉద్యోగం దొరికింది అంటూ తలవంచుకుని మెల్లిగా చెప్పావు నువ్వు. నీ మీద మంచి అభిప్రాయమేకాక, జాలి కూడా కలిగింది నాకు.”

“అసలే మీకు తలనొప్పి. జ్వరం... ఇప్పుడవన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటూ, ఆలోచిస్తూ బుర్రకింకా పనిచెప్పకండి”

అదేది వినిపించుకోనట్టే తన ధోరణిలో తను చెప్పుకుపోయింది సులోచన.

"అలా మా ఇంట్లో అడుగుపెట్టిన నువ్వు. నాకు మా బాబుకీ కూడా ఆప్తురాలివై పోయావు. నా దగ్గరకంటే కూడా నీ దగ్గిరే అల్లరి చెయ్యకుండా బుద్ధిగా వుంటాడు వాడు. నీ కథలూ, కబుర్లూ వాడికి ప్రాణం. నువ్వింట్లో వున్నంతసేపూ నిన్ను పట్టుకుని వొదలడు. అనారోగ్యంతో, దిగుల్తో నిత్యం నేను మంచానపడి వుంటుంటే, నువ్వే కదా వాడిని నాకంటే ఎక్కువగా చూసుకుంటున్నావు. వాడి మొహంలో వాళ్ళ నాన్న పోలికలు చాలా వున్నాయి నిర్మలా. ఇరుగు పొరుగు అంతా కూడా అదే అంటారు కృష్ణగారి పోలికే అని." సులోచన కళ్ళల్లో నీళ్లు నిలిచాయి.

"మీ ఆరోగ్యం బాగుండాలంటే ఇలా ప్రతి నిమిషం దిగుల్తో, ఆలోచనల్తో బాధపడుతూ వుండకూడదు. చెప్పడం తేలికే అనుకోండి... బాధ అనుభవించేవాళ్ళకి..." నిర్మల గొంతు పూడిపోయింది. మాట పూర్తిచెయ్యలేక పోయింది. చటుక్కున తల దించుకుంది.

"మా ఇంట్లో మనిషిలా కల్సిపోయావు నువ్వు. మా బాబుకీ. నాకూ నువ్వు చేస్తున్న సేవలు చూస్తుంటే మనిద్దరదీ ఏ జన్మలో బంధమో అనిపిస్తుంది. అటు ఉద్యోగం, ఇటు ఇంట్లో వున్నప్పుడు మాకు సహాయం చెయ్యటం.... నాకు తోబుట్టువులు లేని లోటు నీ వల్ల తీరింది నిర్మలా. నీది గొప్ప మనసు, నీ అంత మంచివాళ్ళు ఎక్కడా వుండరేమో!..."

"అనవసరంగా పొగిడేస్తున్నారు నన్ను. అతి మాములు మనిషిని నేను. నా అన్నవాళ్ళు లేనిదాన్ని. నా ఒంటరితనం నన్ను బాధపెట్టకుండా, మిమ్మల్ని నా వాళ్ళుగా భావించుకుంటూ తృప్తిపడుతున్నాను. ఈ మాత్రం తృప్తి మీ వల్లనే కదా నాకు దక్కింది...."

"నా కథ తెలిసి నా మీద నీకు జాలీ. నువ్వు ఒంటరిదానివని నీమీద నాకు జాలీ... సరిపోయింది కదూ మనిద్దరికీ" నీరసంగా నవ్వింది సులోచన.

"వెళ్ళిన కొత్తలో ఆయన దగ్గర్నించి వెంటవెంటనే వుత్తరాలొచ్చేవి నిర్మలా, ఆ తర్వాత మెల్లిమెల్లిగా ఉత్తరాలూ, మనియార్డర్లు రావడం తగ్గిపోయింది. నాకు కంగారు పుట్టింది. ఆ రోజుల్లోనే రంగారావు మావయ్య వచ్చాడోసారి. వొస్తూనే "అమ్మాయ్ సులోచనా! మీ ఆయన గురించి ఈమధ్యనే ఒకళ్ళ ద్వారా వినకూడనిది విన్నాను. నువ్వు కాస్త జాగ్రత్త పడాలి" అన్నాడు. "కృష్ణని ఓవగలమారి వల్లోవేసుకుందిట. దాని పేరు గిరిజట" అంటూ చావుకబురు చల్లగా చెప్పి మావయ్య దోవన మావయ్య వెళ్ళిపోయాడు. నాకు కాళ్ళూ, చేతులూ ఆడలేదు. ఆ తర్వాత నుంచీ ఆయన దగ్గర్నించి ఉత్తరాలూ, మనియార్డర్లూ పూర్తిగా ఆగిపోయాయి. నేను ఏడవని రోజు లేదనుకో. నాన్నని ఆ ఊరు పంపించి విషయం తెలుసుకురమ్మందామంటే మంచం దిగి ఇంట్లోనే రెండడుగులు వెయ్యలేని పరిస్థితిగా అయిందా మనిషి ఆరోగ్యం. ఇంక అంతదూరం ప్రయాణం ఏం చెయ్యగలడు? నేను వెళ్దామంటే, పుట్టినప్పటినించీ ఈ ఉళ్ళోనే తప్ప ఏ వూరూ వెళ్ళి ఎరగనిదాన్ని... ఆ కొత్త ఊరు. అంతదూరం ప్రయాణం చెయ్యగల ధైర్యం, అక్కడాయన ఆచూకీ పట్టుకోగల చొరవ నాకు లేవు... ఇంకెవరున్నారు నాకు దిక్కు? మళ్ళీ ఆ రంగారావు మావయ్యే ఎప్పుడేనా ఈ ఊరొస్తే ఆయన్నే బతిమాలుకో వాలనుకున్నాను. ఏవో పన్ల మీద తరచుగా ఆయనీ ఊరొస్తూనే ఉంటాడు. వొచ్చినప్పుడు

దిగేది మా యింట్లోనే. మళ్ళీ నాలుగైదు నెలలగ్గానీ రాలేదు మామయ్య. అప్పుడాయన కాళ్ళా వేళ్ళా పడ్డాను... అప్పుచేసి రానూ, పోనూ టిక్కెట్టుకి సరిపడా ఆయన చేతుల్లో పోశాను. ఎలాగైనా సరే ఆయన్ని కలుసుకుని, ఇక్కడికి తీసుకురమ్మని పంపించాను. మామయ్య ఆ ఊరెళ్ళాడేగానీ, మొహం వేలాడేసుకు వొచ్చాడు తిరిగి...".

"మీకింకా జ్వరం ఎక్కువైపోతుంది. అలా మాట్లాడుతూ వుంటే... పడుకోండి అక్కయ్యగారూ...' నచ్చచెప్పాలని చూసింది నిర్మల.

"మరేం ఫర్వాలేదు. నోరు విప్పి చెప్పుకునేందుకు నువ్వు తప్ప మరెవరున్నారు నాకు?... రోజూ నీతో నా మనసులో బాధ చెప్పుకుంటూ ఉంటే అదో తృప్తి... కొంత భారం దించుకున్నట్టుగా వుంటుంది నాకు."

నిర్మల కళ్ళల్లో నీలి నీడలు కదలాడాయి.

"మావయ్య తిరిగొచ్చి ఏం చేప్పాలో తెల్సా నిర్మలా? మీ ఆయన ఊళ్ళోలేదమ్మాయ్; ఆ ఉద్యోగానికే తిలోదకాలిచ్చేశాడు. ఆ గిరిజ ఎవత్తోగానీ మీ ఆయన్ని బుట్టలో వేసుకోవడమే కాదు. తెల్సినవాళ్ళ కంటపడకూడదని కాబోలు, ఆ ఊర్నించే లేవదీసుకు పోయినట్టుంది. ఇదంతా దాని పనే అయివుంటుంది. లేకపోతే ఉద్యోగం వొదిలి అయిపూ, జాడా లేకుండా పోవాల్సిన అవసరం మీ ఆయనకెందుకొస్తుంది? అన్నాడు నెత్తీ నోరు బాదుకున్నాను. ఆ గిరిజ ఎవత్తోగానీ దాన్ని తిట్టని రోజు లేదు నాకు. ఆ రాక్షసి కనపడితే పీక నులిమెయ్యాలని వుంది. ఆయనెక్కడున్నారో? ఎలా వున్నారో?...."

!+!+!+!

ఎక్కడికెళ్ళిపోయారండీ? నన్నొదిలిపెట్టి ఎందుకెళ్ళిపోయారు? నన్ను ప్రేమించానంటూ మీ అంతట మీరే నా జీవితంలో ప్రవేశించి... నాలో ఆశలు కల్పించారు. మిమ్మల్నే పూర్తిగా నమ్ముకున్నానే... మనస్ఫూర్తిగా నన్ను మీకర్పించుకున్నానే... ఇన్నాళ్ళూ ఉన్నట్టే వుండి హఠాత్తుగా నన్నొదిలి పెట్టి ఈ ఊర్నించే వెళ్ళిపోయారా? ఇంత మోసమా? నేనేం పాపం చేశానని నాకీ శిక్ష. మన కాపురం మూడు రోజుల ముచ్చటేనా?...." గిరిజ దుఃఖానికంతులేదు. అనుభవించినన్నాళ్ళు అనుభవించి మోజు తీరగానే ఫలాయనమంత్రం పఠించాడు హరి.

!+!+!+!

ఆ రోజు ఏదో పనిమీద ఆ ఊరొచ్చి, ఎప్పటిలాగే "అమ్మాయ్! సులోచనా ఎలా ఉన్నావ్?" అంటూ ఇంట్లో అడుగు పెట్టాడు రంగారావు.

నిర్మల ఆ ఇంట్లో అద్దెకి వచ్చినప్పటి నుంచీ ఆయన కళ్ళు ఆమె మీద పడ్డాయి.

ఆ మధ్య వొచ్చినప్పుడోసారి చనువుగా వెకిలిగా ప్రవర్తించబోతే కరుకుగా సమాధానం చెప్పి, చీదరించుకుంది నిర్మల. ఆ కోపం... ఆ అవమానం ఆయన మనసులో అలాగే ఉండిపోయాయి.

దీని కెంత గర్వం! ఏం చూసుకుని ఆ పొగరు.. అని కుతకుతలాడిపోతూనే వుంటుందాయన మనసెప్పుడూ...

"ఏదీ రవిబాబు? ఇప్పుడెలా వుంది వాడి ఆరోగ్యం? ఈ మధ్య పెద్ద జబ్బుచేసి తగ్గిందిట కదా వాడికి? ఈ ఊర్నించి వొచ్చిన వాళ్ళెవరో చెప్తే తెల్సింది." వాలు కుర్చీలో వెనక్కి చేరపడుతూ అడిగాడు రంగారావు యోగక్షేమాలు.

"బాబు నిర్మల దగ్గిర ఆడుకుంటున్నాడు. మామయ్యా... ఈ రోజు సెలవు కదా స్కూల్‌కి... నిర్మల ఇంట్లో వుందంటే పిన్నీ, పిన్నీ అంటూ ఒక్క క్షణం కూడా వొదిలిపెట్టడు వాడు, నిజం చెప్పాలంటే నిర్మల దయవల్లే నా బిడ్డ నాకు దక్కాడు మావయ్యా... కంటికి రెప్పలా వాడిని చూసుకుంది... ఇటు నేను పడకేశాను... అటు వాడి అనారోగ్యం... సొంత వాళ్ళు కూడా చెయ్యరు... అంతలా మమ్మల్ని చూసుకుంది..." సులోచన అలా నిర్మలని పొగడడం ఏ మాత్రం నచ్చలేదు రంగారావుకి.

అప్పుడే వొచ్చాడు రవిబాబు "అమ్మా!" అంటూ.

"రా... రా... తాతయ్యొచ్చాడు... రా... కబుర్లు చెప్పు.... అరే... గొలుసేదిరా?" గబుక్కున కొడుకుని దగ్గరకి తీసుకుని మెళ్ళో చూసింది సులోచన.

"ఇందాక ఏడ్చి, గొడవ చేసి నా మెళ్ళో గొలుసు నీకు వేస్తేగానీ ఊరుకోలేదు కదురా, ఎలాగో అలా మరిపించి తర్వాత తీసుకో వచ్చులే అనుకున్నాను. తియ్యడం మర్చిపోయాను ఏదీ గొలుసు? మెళ్ళోలేదే... కంగారు హెచ్చింది సులోచన గొంతులో అయోమయంగా చూశాడు రవిబాబు.

"ఏవో..." అంటూ చేతులు తిప్పాడు బిక్క మొహం పెట్టి

"అయ్యో! ఎక్కడ పడిపోయిందో ఏమిటో... ఎక్కడని వెతకనూ నేను? ఎక్కడెక్కడ ఆడావో!...."

తను ఇంట్లోకి వొస్తుండగా గేటుదగ్గర మట్టిలో మెరుస్తూ కనిపించిన గొలుసు తీసి గప్‌చిప్‌గా జేబులో వేసుకున్న రంగారావు, ఒకసారి జేబు తడుముకుని తృప్తిపడ్డాడు.

"నువ్వు మరీనూ... చిన్నపిల్లాడు ఎక్కడికి పోయి ఆడతాడూ?.... వాడు వెళ్ళింది ఆ వాటాలోకే కదా? అక్కడే ఆగదిలోనే పడిపోయి వుంటుంది. వెళ్ళి చూస్తే సరి." హడావిడిగా ఇంట్లో వెతుకుతున్న సులోచన తెల్లబోయి చూసింది.

"అదేమిటి మామయ్య! నిర్మల గదిలో పడి ఉంటే ఈ పాటికి తీసుకొచ్చి ఇచ్చెయ్యదూ తను?"

"నల్లని వన్నీ నీళ్ళు. తెల్లనివన్నీ పాలనుకుంటావు. అందర్నీ నమ్ముతావు. ఏరోజు ఎవరి బుద్ధి ఎలా మారుతుందో ఎవరు చెప్పగలరు? ఇల్లంతా వెతికినట్టే ఆ గదిలో కూడా వెతికితే తప్పేముందీ?" అంటూనే నిర్మల వాటాలోకి ముందు తనే దారి తీశాడు రంగారావు.

"రవిబాబు మెళ్ళో గొలుసుట ఇక్కడేవన్నా పడిపోయిందా?" దీర్ఘంతీస్తూ ఆయనా గదిలో అడుగుపెడుతుంటే అప్రయత్నంగా తనూ ఆయన వెనకనే నడిచింది సులోచన.

"వాడు నా దగ్గర కొచ్చినప్పుడు మెళ్ళో గొలుసేమీ లేదే..." తన చేతిలో వున్న చిన్న అట్టపెట్టి చటుక్కున మూసేసింది నిర్మల. ఆ పెట్టి మీద వాళ్ళ దృష్టి పడకుండా వుండాలని కిటికీలో మూలగా పెట్టేసి, తను అడ్డుగా నిలబడింది దానికి.

"అయితే వాడు నీ దగ్గరికి రాకముందే. అంతకుమునుపే అదెక్కడోజారిపోయిందన్న మాట.. మెళ్ళో వెయ్యమని ఒక్కటే పేచీ పెడుతుంటే, కొంచెం సేపయ్యాక తీసేద్దామనుకుని వేశాను. తర్వాత దాని సంగతి మర్చేపోయాను" నిట్టూర్చింది సులోచన. కిటికీలో నిర్మల పెట్టిన అట్టపెట్టె మీదే వున్నాయి రంగారావు చూపులు.

తాము ఆ గదిలోకొచ్చేసరికి, అందులో ఉన్నదేదో చూస్తోంది తమని చూడగానే, కాస్తకంగారు పడ్డట్టే కనిపించింది. ఆ పెట్టెలో ఏవుందో?.... రంగారావులో ఆతృత మరి ఆగలేనంది.

కిటికీలో వెతుకుతున్నట్టు చూస్తూ, పెట్టె మీద చెయ్యి వేశాడు.

"అది తియ్యకండి..." త్వరత్వరగా అంది నిర్మల.

"ఏం తీస్తే?" వెకిలిగా నవ్వుతూ, అదోలా చూశాడు.

"దయచేసి తియ్యకండి"

సులోచన భృకుటిముడి పడింది. ఏవుంది అందులో? మావయ్య అన్నమాటలు నిజమేనేమో? గొలుసు అందులో పెట్టిందేమో? ఆ పెట్టె దాచుకునే లోపలే తాము రావడంతో కంగారు పడుతూ కిటికీలో పెట్టింది... లేకపోతే ఆ బెదురు చూపులెందుకూ? ఆ పెట్టె తియ్యొద్దని అనటమెందుకూ?... నిర్మలంత మంచి వాళ్ళు అరుదుగా వుంటారని నమ్ముతున్న తన నమ్మకం అర్థంలేని దేనా?.. మరి ఆలోచించలేకపోయింది ఏదో ఆవేశం వొచ్చినట్టుగా ఒకడుగు ముందుకువేసి, కిటికీలో అట్టపెట్టె అందుకుంది తను. ఇలా ఇచ్చెయ్యండి అన్నట్టుగా గబుక్కున చెయ్యి చాపింది నిర్మల. ఆ భావం కళ్ళల్లో చూపిస్తూ.

సులోచన అనుమానం బలపడింది.

నిర్మల గుండెల్లో రాయిపడింది.

సులోచన ఎడమచేయి అట్టపెట్టె మూతతీసింది.

నిర్మల కుడిచేయి అదురుతున్న గుండెల్ని అదిమిపెట్టింది.

అట్టపెట్టెలో వున్న ఒకే ఒక చిన్న ఫోటో బయటికి తీసింది సులోచన.

నిర్మల కళ్ళల్లో నీరుబికి వచ్చింది.

సులోచన కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి.

నిర్మల కళ్ళు నేలనంటుకుపోయాయి.

వెర్రిదానిలా చేతిలో ఉన్న ఫోటో వంక చూస్తుండి పోయింది సులోచన.

ఆ ఫోటో తన భర్త కృష్ణది...

ఫోటో మీద ఒక మూలగా రాసి వుంది "నా ప్రియమైన గిరిజా నిర్మలకి... ప్రేమతో హరికృష్ణ". అర్థమైంది సులోచనకి. తను రోజూ తిట్టుకునే ఆ గిరిజే ఈ నిర్మల.. గిరిజా నిర్మల.తన భర్తని వల్లో వేసుకోలేదు. వంచింప బడింది.

★☆★☆★